క్లుప్తంగా

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నట్లు డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయ గణాంక అధికారి హేమసుందర్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలపై గత నాలుగు రోజులుగా జాతీయ కుటుంబ ఆరోగ్య సేవా ఆధ్వర్యంలో మండలంలోని శకునాల గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీసీడీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని సర్వే బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వ్యాధిని రోధక టీకాలు, పెద్దల్లో సంక్రమించే టీబీ, కుష్టు, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు చికిత్సతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, 104 వాహన సేవలు, ఆరోగ్య బీమా పథకాలు సక్రమంగా అందుతున్నట్లు సర్వేలో గుర్తించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్ ప్రకాష్‌రావు, టీమ్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సచివాలయ ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశావర్కర్లు ఉన్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు


విద్యార్థినికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్ర మింగిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో రక్తహీనత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత తెలిపారు. గురువారం ఆమె స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం వల్ల రక్తహీనత రాదన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుప్రియ, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీ పురుషులిద్దరూ సమానమే

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వెంకటరమణ కాలనీలో గర్భస్థ స్త్రీ, శిశు లింగనిర్ధారణ చట్టం-1994పై జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భస్థ స్త్రీ, శిశు లింగనిర్ధారణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆడ శిశువు అని తెలుసుకుని అబార్షన్ చేయించుకోవడం వల్ల స్త్రీ శిశు జననాలు తగ్గిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ కర్నూలు అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, సభ్యులు, యువతీయువకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐడీ కార్డులు, స్టిక్కర్లు జారీ చేయండి

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు ఐడీ కార్డులు, ఎంట్రీ స్టిక్కర్లను జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదనరావు ఆయా శాఖల హెచ్‌ఓడీలను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబరులో హెచ్‌ఓడీలతో సమావేశమయ్యారు. స్వచ్ఛ కలెక్టరేట్‌కు అధికారులు సహకరించాలన్నారు. ఏ శాఖ పరిధిలోని కార్యాలయాన్ని ఆశాఖ సిబ్బందే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. త్వరలోనే బైక్‌లు, కార్లను ఎక్కడ పార్కింగ్ చేయాలో చెబుతామన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఉల్చాల గ్రామ సచివాలయంలో ఆర్డీఓ హరిప్రసాద్ గురువారం బూత్‌లెవల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ముసాయిదా ఓటరు జాబితాలోని తప్పులను సరి చేయాలని ఆయన సూచించారు. అనంతరం నూతన ఓటరు జాబితాలను బీఎల్‌ఓలకు అందజేశారు. సమావేశంలో తహసీల్దారు శివరాముడు, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ పాల్గొన్నారు.

హాకీ స్టిక్స్, టీషర్టుల పంపిణీ


క్రీడాకారులకు హాకీ స్టిక్‌లు, టీషర్టులు వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

కర్నూలు: నగరపాలక మున్సిపల్ హైస్కూల్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు హాకీ క్రీడాకారులకు టీషర్టులు, హాకీ స్టిక్‌లను పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సుధీర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు క్రీడాకారులకు హాకీ స్టిక్స్, టీషర్టులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, అబ్దుల్లా, రఘునాథ్, శేఖర్, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెదడులో కలకలం

సాదాసీదాగా రోడ్డుపై వెళ్తూ ఒక్కసారిగా కింద పడిపోయి కాళ్లూ చేతులు కొట్టుకుంటూ ఉంటారు. పళ్లు బిగబట్టి గట్టిగా అరుస్తూ నోట్లో నురగలు కక్కుతూ కనిపిస్తుంటారు. కొన్ని నిమిషాల తర్వాత సాధారణ స్థితికి వస్తారు. చూడ్డానికి భయానకంగా కనిపించే ఈ దృశ్యం మూర్ఛవ్యాధి బాధితులది. వారికి ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో ఇలాంటి ఘటన వస్తుందో అర్థం గాని పరిస్థితి. ఇలాంటి వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకు ఏటా నవంబర్ 17న జాతీయ మూర్ఛవ్యాధి దినోత్సవంగా నిర్వహిస్తారు. – కర్నూలు(హాస్పిటల్)

- మూర్ఛ వ్యాధితో సతమతం
- పెద్దాసుపత్రిలోని న్యూరాలజీ విభాగానికి నెలకు 2 వేల ఓపీ
- అందులో 20 శాతం ఫిట్స్ కేసులే
- జిల్లాలో 40 వేల మందికి పైగా మూర్ఛ రోగులు
- ప్రైవేటు వైద్యుల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- నేడు జాతీయ మూర్ఛ వ్యాధి అవగాహన దినం


పెద్దాసుపత్రిలోని న్యూరాలజీ విభాగానికి వచ్చిన రోగులు


ఫిట్స్‌కు గురైన యువతి (ప్రతీకాత్మక చిత్రం)

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి వారంలో సోమ, గురు వారాల్లో ఓపీ నిర్వహిస్తారు. ఇక్కడికి ప్రతి ఓపీ రోజున 200 మంది దాకా చికిత్స కోసం వస్తారు. ఈ లెక్కన నెలకు సగటున 2 వేల మంది, సంవత్సరానికి 24 వేల మంది ఓపీలో వైద్యం పొందుతున్నారు. వీరిలో 20 శాతం మంది అంటే 4,800 మంది మూర్ఛ వ్యాధి బాధితులున్నారు. వీరే గాక సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రులల్లో వైద్యుల వద్దకు వెళ్లే వారు మరో 8 వేల మంది ఉంటారని అంచనా. ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగంలో ప్రస్తుతం ఐపీ సేవలతో పాటు ఈఈజీ, ఎపిలెప్సీ స్టడీ సేవలు కూడా లభిస్తున్నాయి. ఈ పరీక్షలు నెలకు 250, ఏడాదికి 3వేల మందికి చేస్తున్నారు. ప్రైవేటుగా ఈ పరీక్షలు చేయించుకోవాలంటే ఒక్కొక్కరికి రూ.2 వేలకు పైగా ఖర్చవుతోంది. అవసరమైన వారికి ఎంఆర్‌ఐ, వీడియో ఈఈజీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో ఈ యేడాది పీజీ సీట్లు మంజూరు కావడంతో త్వరలో పీజీలు చేరే అవకాశం ఉంది. దీంతో మరిన్ని వైద్యసేవలు ఇక్కడ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మూర్ఛవ్యాధికి నాటు మందు తీసుకునే వారు కూడా ఇంకా ఉన్నారు. నాటు మందు తీసుకుంటే వ్యాధి శాశ్వతంగా తగ్గుతుందన్న నమ్మకంతో అటువైపు వెళ్లి వ్యాధి ముదిరాక తిరిగి అల్లోపతి వైద్యుల వద్దకు చికిత్స కోసం వస్తున్నారు. ఆ పరిస్థితుల్లో ఒకేసారి ఎక్కువ డోసుతో మందులు ఇవ్వాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు.

మూర్ఛ వ్యాధి ఎలా వస్తుందంటే...!

మూర్ఛ(ఫిట్స్) అంటే మానవ కేంద్రీయ నాడీ వ్యవస్థ రుగ్మతల సమూహం. మెదడులోని ఎలక్ట్రిక్ యాక్టివిటీ అసాధారణ పగుళ్ల వల్ల ఇది సంభవిస్తుంది. మూర్ఛలకు కారణం వాటి కేంద్ర స్థానాన్ని బట్టి వర్గీకరించవచ్చు. మూర్ఛలు తరచుగా కన్వల్షన్స్ లేదా ఎపిలెప్టిక్ ఫిట్స్‌గా సూచిస్తారు. ఇది సున్నా నుంచి 10 ఏళ్లలోపు, 50 నుంచి 70 ఏళ్లలోపు వారికి కలుగుతుంది. ఒక్కోసారి ఏ వయస్సులో వారికైనా రావచ్చు.

మూర్ఛ వ్యాధికి కారణాలు

వంశపారంపర్యం, మెనింజైటిస్, రక్తంలో షుగర్ శాతం పెరగడం, తగ్గడం , మెదడుకు గాయాలైనప్పుడు, గడ్డలు ఉన్నప్పుడు, రక్తంలోని కొన్ని ఆటో ఇమ్యూన్ కారణాల వల్ల మూర్ఛ వస్తుంది.

మూర్ఛవ్యాధి నిర్ధారణ

మూర్ఛ పేరుతో వైద్యుని వద్దకు వచ్చిన వెంటనే అతని పక్కన ఉన్న వ్యక్తితో జరిగిన సంఘటన గురించి వైద్యులు ఆరా తీసి అది మూర్ఛనా కాదా అని నిర్ధారిస్తారు. నిర్ధారణ కోసం అవసరమైతే సీటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఈఈజీ పరీక్షలు చేయిస్తారు. కొన్నిసార్లు వీడియో ఈఈజీ పరీక్ష కూడా చేయాల్సి రావచ్చు. వీటి ద్వారా మెదడులోని ఏ భాగంలో దెబ్బతినడం వల్ల మూర్ఛ వస్తుందో గుర్తిస్తారు.

మందులు మధ్యలో ఆపకూడదు



మూర్ఛ వ్యాధిగ్రస్తులు రెగ్యులర్‌గా మందులు వాడాలి. మధ్యలో మందులు ఆపకూడదు. రాత్రివేళ ఎక్కువగా మేల్కొనకూడదు. వైద్యుల సూచన మేరకు అవసరమైన డోసు మందులను వాడాలి. ఆల్కాహాలు తీసుకోకూడదు. ఈ వ్యాధిగ్రస్తులు దాదాపు 75 శాతం మందిని మందులతోనే పూర్తిగా నయం చేయవచ్చు. కేవలం 25 శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. ఇలాంటి ఆపరేషన్లకు ఎక్కువగా కేరళలోని శ్రీ చిత్ర ఆసుపత్రికి వెళతారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని నిమ్స్, ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రులు ప్రసిద్ధి చెందాయి. ప్రస్తుతం మూర్ఛకు అన్ని రకాల వైద్యపరీక్షలు, చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తున్నాం. – డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ హెచ్‌ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

గర్భిణులు ప్రత్యేక మందులు వాడాలి



చాలా మంది యుక్తవయస్సు అమ్మాయిలకు మూర్ఛ ఉంటుంది. వారికి వివాహమైన తర్వాత గర్భం దాల్చిన సమయంలో పాత ఫిట్స్ మందులే వాడకూడదు. అలా వాడితే ఆమెతో పాటు కడుపులో ఉన్న బిడ్డపై కూడా ప్రభావం చూపుతుంది. గర్భం దాల్చిన సమయంలో వైద్యులను కలిసి వారి సూచనలతో ప్రత్యేక మందులు వాడాలి. దీనివల్ల గర్భిణితో పాటు శిశువుకూ ఎలాంటి హాని జరగదు. దీంతో పాటు ఆ సమయంలో వాడే ఫోలిక్ యాసిడ్ మందులు సైతం నరాలపై ఎంతో మేలు చేస్తాయి. ఈ విషయమై యువతులు అవగాహన పెంచుకోవాలి. – డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

భగవాన్ జయంతి ఉత్సవాలను

పకడ్బందీగా నిర్వహించండి


గిరిజన స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): భగవాన్ బిర్సా ముండా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను నిర్వహించారు. బిర్సా ముండాతోపాటు పలువురు గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలను భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు

- జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. గురువారం అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాధాన్యతను కోల్పోయిన డీసీఎంఎస్‌కు వెలుగులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆస్తులను పరిరక్షిస్తూ, వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సహకారంతో అన్ని మండలాల్లోను డీసీఎంఎస్ బ్రాంచీలను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు ప్రతి మండలంలో 15 సెంట్ల స్థలం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డీసీఎంఎస్ కార్యాలయాలను డిజిటలైజేషన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామాంజనేయులు, సబ్ డివిజినల్ సహకార అధికారి నాగరమణయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ దేవభూషణం, మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ డిపో పరిధిలోని ప్రయాణికులు ఫోన్ 9959225794 నంబరుకు సంప్రదించి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

19న ఇస్కాన్‌లో గోవర్ధనగిరి పూజ

కర్నూలు కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కంచుకుని ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఈనెల 19న గోవర్ధనగిరి పూజ నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవకదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హరినామ సంకీర్తన గోవర్ధన లీల ప్రవచనం, మధ్యాహ్నం 12కు 108 రకాల ఆహార పదార్థాలతో మహా రాజ భోగ నివేదన, మహాహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అభ్యంతరాలను పరిశీలించండి

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా జాబితాపై వచ్చే అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమై మాట్లాడారు. పెండింగ్‌లోని ఫారం-6, 7, 8లను మంగళవారం నాటికీ డిస్పోజ్ చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన అవసరాలను త్వరగా తెలపాలన్నారు. సమావేశంలో కల్లూరు, ఓర్వకల్లు తహసీల్దార్లు రమేష్‌బాబు, శివప్రసాదరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

కర్నూలు సిటీ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రీ సూచించారు. గురువారం మండల పరిధిలోని గార్గేయపురం స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం తయారు చేసే సమయంలో శుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం భోజనం వడించాలని ఏజెన్సీ నిర్వాహకులకు, హెచ్‌ఎంకు సూచించారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థికాభివృద్ధి


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొంది, ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక 48వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రోజా వీధి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హులకే అందేలా చూస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం టీడీపీ కార్యకర్తలు, నాయకులు చెప్పిన వాళ్లకే పథకాలు అందేవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, కార్పొరేటర్ మల్లికా బేగం, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు దాదా బాషా, నాయకులు మద్దయ్య, కృష్ణకాంత్, జిలానీ, గౌస్, అబ్దుల్లా, నాసీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సూచించారు. గురువారం పాతబస్తీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన 1వ వార్డు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం ఎన్నో పథకాలు తెచ్చి, పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ గత ఎన్నికల ముందు చెప్పిన ప్రతి హామీని నెరవేర్చారని, పేదలకు చేసిన మేలును ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీడీపీ విమర్శలను తిప్పి కొట్టాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ షాషావలి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో గురువారం ×ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి₹ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎంపీపీ వెంకటేశ్వరమ్మతో కలిసి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. సచివాలయంలో గ్రామానికి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల్లోని పేదలకు సీఎం జగనన్న సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. దిన్నెదేవరపాడు గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.32,09,69,855 లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనురాధ, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు హరినాథ్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వేణుగోపాల్, శేషన్న, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై మోదీ ఫొటో ఏర్పాటు చేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కేశవ చౌదరి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తున్న 9,260 రేషన్ వాహనాలకు అందించిన రాయితీలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై అధికారులు స్పందించి డిసెంబర్ 2వ తేదీలోగా వాహనాలపై మోదీ ఫొటో ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో 23న బీజేవైఎం ఆధ్వర్యంలో తామే మోదీ ఫొటోలు ఏర్పాటు చేస్తామన్నారు.



మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

కోడుమూరు రూరల్ : మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ వైకేపీ పీడీ సలీం బాషా సూచించారు. గురువారం కోడుమూరులోని మండల మహిళా సమాఖ్య భవనంలో 'ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం-మహిళలు జీవనోపాదులను మెరుగుపరుచుకునే' అంశాలపై తొమ్మిది మండలాల ఏపీఎంలు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం బాషా మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలను అమలు చేయడంతో పాటు, పొదుపు సంఘాల ద్వారా విరివిగా రుణాలను అందజేస్తోందన్నారు. మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాదులను మెరుగుపరచుకుని మహిళా సాధికారతకు కృషి చేయాలని సూచించారు. అనంతరం శిక్షకులు జీవనోపాదులు మెరుగుపరుచుకునేందుకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎం అబ్దుల్ రహిమాన్, ఏపీఎం పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం


కర్నూలుకు చెందిన దాతకు బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సింహాద్రి అప్పన్న రూ.1,00,116లు, కర్నూలుకు చెందిన వెంకటేశ్వర రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలో అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, బాండు, జ్ఞాపికను అందజేశారు.

అలసిన మనసుకు ఆహ్లాదం





కర్నూలు నగరం నందన వనంగా మారుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో అలసిపోయిన ప్రజలకు పార్కులు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. స్మార్ట్‌సిటీ నిధులతో ఇప్పటికే సైన్సు, కల్చరల్, ఫ్రూట్స్, కార్టూన్, గ్లోగార్డెన్, వీనస్ నగర్ జెండా పార్కులను అందుబాటులోకి తెచ్చిన నగర పాలక అధికారులు తాజాగా రూ.1.71 కోట్లు వెచ్చించి సీతారామనగర్‌లో బాల సుబ్రమణ్యం పేరుతో మ్యూజిక్ పార్కు ప్రారంభానికి సిద్ధం చేశారు. దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత కళాకారుల చిత్రాలు, సంగీత వాయిద్యాల చిత్రాలు నగర వాసులను ఆకట్టుకోనున్నాయి. మొక్కలు, పచ్చ గడ్డి, బెంచీలతో పాటు, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఏన్నడూ లేని విధంగా మున్సిపల్ పార్కులను అందంగా తీర్చిదిద్దడంతో అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





